సాక్షి
మెదక్
శుక్రవారం ၊ 26 ၊ మే ၊ 2023



ఒకేచోట చితి పేర్చి.. 8లో
ఔరంగాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన అన్నదమ్ముల మృతదేహాలు గురువారం స్వగ్రామానికి చేరుకోగా కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు
సంగారెడ్డిటౌన్: జీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల ఉపాధ్యాయ ఉచిత శిక్షణకు గడువు పొడిగించినట్లు జీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రాములు గురువారం తెలిపారు. ఈనెల 28 వరకు గడువు పొడిగించామని, డిగ్రీతోపాటు బీఈడీ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లా నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



రోడ్డు ధ్వంసమై.. 9లో
రంగంపేట తురకల చెరువుకట్ట మీదుగా సదాశివనగరం, కోనాపూర్, వై.మాందాపూర్‌కు వెళ్లే అంతర్గత రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుకు ఇరువైపులా ముళ్లపొదలు కమ్ముకున్నాయి.

పోడు రైతు.. గోడు తీరే

- జూన్ 24 నుంచి లబ్ధిదారులకు పట్టాల పంపిణీ
- జిల్లాలో 610 మందికి.. 520 ఎకరాలు
- ఈ వానాకాలంలోనే 'రైతుబంధు'



కొల్చారంలో పోడు భూముల సర్వే చేపడుతున్న అధికారులు (ఫైల్)

మెదక్‌జోన్: గిరిపుత్రుల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. అర్హులైన పోడు రైతులందరికీ పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ వానాకాలంలోనే రైతుబంధు సైతం ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది. అటవీ భూములు సాగు చేసుకుని జీవనం సాగించే గిరిజన పోడు రైతులకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ సీఎం కేసీఆర్ ఇటీవల కీలక నిర్ణయం తీసుకున్నారు.

- జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులు కలిపి 16 మండలాల పరిధిలోని 63 గ్రామాల్లో 10 వేల మంది 6,872 ఎకరాల అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.
- 2021లో పోడు సాగుదారులకు ప్రభుత్వం పట్టాలు అందజేస్తామని చెప్పడంతో వీరంతా దరఖాస్తు చేసుకున్నారు.
- అనంతరం కేవలం గిరిజనులకు మాత్రమే పట్టాలు ఇస్తామని అధికారులు గిరిజన లబ్ధిదారులను ఎంపిక చేశారు.
- ఇందులో 16 మండలాల పరిధిలో 610 మంది లబ్ధిదారులకు గానూ 520 ఎకరాల పట్టా పాస్ పుస్తకాలు అందించనున్నట్టు అధికారులు చెబుతున్నారు.
- జూన్ 24వ తేదీ నుంచి అర్హులకు పోడు పట్టాల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.
- దీంతో దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న గిరిజన రైతులకు చట్టబద్ధమైన హక్కుతో కష్టాలన్నీ తీరనున్నాయి.
- దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జూన్‌లో పట్టాల పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేయాలని సీఎం ఇప్పటికే ఆదేశించారు.
- దీంతో జిల్లా యంత్రాంగం కార్యాచరణకు సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కలెక్టర్ రాజర్షిషా ఆదేశాలు జారీ చేశారు.

జిల్లాలో ఇలా..

- రాష్ట్ర ప్రభుత్వం 2021లో పోడు భూములకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించింది.
- జిల్లాలో గిరిజనులు, గిరిజనేతరులు కలిపి మొత్తం 10 వేల మంది 6,872 వేల ఎకరాలకు దరఖాస్తు చేసుకున్నారు.
- రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు సాంకేతికత ఆధారంగా ప్రత్యేక బృందాలతో సర్వే చేపట్టారు. దరఖాస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు.
- అనంతరం గ్రామ సభలు నిర్వహించి అర్హుల జాబితాను వెల్లడించారు. వివరాలపై సబ్ డివిజన్, ఆపై జిల్లా అటవీ హక్కుల కమిటీ సమావేశాలు నిర్వహించింది.
- అనంతరం అధికారులు కేవలం గిరిజనులకు మాత్రమే పోడు పట్టాలు ఇవ్వనున్నట్టు తేల్చి అర్హుల తుది జాబితాను రూపొందించారు.
- మొదట్లో కొంతమంది గిరిజనుల దరఖాస్తులను తిరస్కరించడంతో వారి నుంచి తీవ్రమైన నిరసన వ్యక్తం అయింది.
- దీంతో ప్రభుత్వం తిరస్కరణ దరఖాస్తులను మళ్లీ పరిశీలించింది. తుది జాబితాలో అర్హులకు చోటు కల్పిస్తూ ఊరట కల్పించింది.
- 2005 డిసెంబర్‌కు ముందు పోడు సాగుదారులందరికీ ఎట్టకేలకు హక్కు పత్రాలు దక్కనున్నాయి.
- కొత్తగా పట్టాలు పొందిన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు తెరిపించి ఈ వానాకాలానికి సంబంధించిన రైతుబంధు జమ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.
- ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు.

ఆదేశాలు రాగానే..

జిల్లావ్యాప్తంగా 610 మంది లబ్ధిదారులకు 510 ఎకరాల పోడు పట్టాలు అందజేయనున్నాం. ఇందుకు సంబంధించి రెండు దఫాలుగా క్షుణ్ణంగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేశాం. పై నుంచి ఆదేశాలు రాగానే పోడు పట్టాలను అర్హులకు అందజేస్తాం.

– విజయలక్ష్మి, జిల్లా ఇన్‌చార్జ్ ఎస్టీ సంక్షేమశాఖ అధికారిణి



మెదక్ కలెక్టరేట్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు, పోడు భూముల పట్టాల పంపిణీ, తదితర అంశాలపై గురువారం సచివాలయంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి కలెక్టర్ రాజర్షిషా, ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి హాజరయ్యారు.

24 గంటల్లో ధాన్యం అన్‌లోడ్ చేయాలి



రైస్‌మిల్లర్లు, అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు కలెక్టర్ రమేశ్

తూప్రాన్: ధాన్యంతో వచ్చిన లారీలను 24 గంటల్లో అన్‌లోడ్ చేయాలని అదనపు కలెక్టర్ రమేశ్ రైస్ మిల్లర్లకు సూచించారు. గురువారం మండలంలోని ఆయా రైస్ మిల్లులను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా దించుకుంటేనే తిరిగి లోడింగ్ చేయడానికి అవకాశముంటుందన్నారు. హమాలీలను అధిక సంఖ్యలో పెట్టుకొని ఖాళీ చేయాలని పేర్కొన్నారు. అలాగే ధాన్యంలో కోత పెట్టరాదని.. వెంటనే ట్రక్ షీట్ జారీ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్ సీఎంఆర్‌ను ఈనెలాఖరులోగా ఎఫ్‌సీఐకి తరలించాలని సూచించారు. గన్నీ బ్యాగులు, లారీల సమస్య తలెత్తకుండా నిరంతరం మానిటరింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా జరిగేలా జిల్లా అధికారులందరూ అప్రమత్తంగా ఉండి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించామని చెప్పారు. జిల్లాలో 407 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నట్లు తెలిపారు. 33,776 మంది రైతుల నుంచి 1,43,362 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ శ్యాం ప్రకాష్, తహసీల్దార్ జ్ఞానజ్యోతి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పనులు త్వరగా పూర్తి చేయాలి



చిన్నగొట్టిముక్కలలో పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

శివ్వంపేట(నర్సాపూర్): మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలలో గుర్తించిన పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ సూచించారు. గురువారం శివ్వంపేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు చిన్నగొట్టిముక్కల గ్రామం పాఠశాలలలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి సీఎంఓ కార్యదర్శి నర్సింగ్‌రావు కృషితో ప్రత్యేక నిధులు మంజూరైనట్టు తెలిపారు. మరో 15 రోజులలో పాఠశాలలు ప్రారంభం కానున్నాయని.. ఆలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీఓ నవీన్‌కుమార్, ఎంఈఓ బుచ్యానాయక్, సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, బాలమణి నరేందర్, ఎంపీటీసీ దశరథ, తదితరులు ఉన్నారు.

రైతుల ఇబ్బందులు తీర్చండి



అధికారులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నియోజకవర్గంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి వడ్లను రైస్ మిల్లులకు తరలించేందుకు వాహనాలు సమకూర్చి సమస్యను పరిష్కరించాలని టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ అధికారులను కోరారు. కొనుగోలు కేంద్రాలకు వాహనాలు సమకూర్చేందుకు చౌరస్తాలో ఉన్న ఇన్‌చార్జ్ ఆర్‌డీఓ సాయిరాంతో పాటు అధికారుల బృందాన్ని ఆయన రైతులతో కలిసి సమస్యను వివరించారు. వాహనాలు రాకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో వడ్లను తూకం వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొక్కుబడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది తప్ప వసతులు కల్పించలేదని ఆరోపించారు. ఈసందర్భంగా ఆర్‌డీఓ సాయిరాం స్పందిస్తూ ధర్నా చేస్తే సమస్య పరిష్కారం కాదని అవసరమైన కేంద్రాలకు వాహనాలు పంపేందుకు తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

రాక్షస పాలనను అంతమొందించాలి



మాట్లాడుతున్న మురళీధర్ యాదవ్

కౌడిపల్లి(నర్సాపూర్): బీఆర్‌ఎస్ రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్, బీజేపీ నాయకుడు మురళీధర్ యాదవ్ అన్నారు. గురువారం కౌడిపల్లిలో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం అన్ని రాష్ట్రాలతో పాటు తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధికి పాటుపడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో హామీలను విస్మరించిందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు, బస్తాలు లేవని.. ఇసుక మాఫియా, మట్టి మాఫియాకు మాత్రం లారీలు ఉన్నాయని విమర్శించారు. ఈనెల 30 నుంచి జూన్ 30 వరకు కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికీ తెలియజేసేందుకు మహాజన్ సంపర్క్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు, రాకేశ్, మండల ఇన్‌చార్జి గోడ రాజేందర్, ఓబీసీ, దళితమోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్, మహిపాల్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మతండాలో కార్డన్ సెర్చ్

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి బతుకమ్మతండాలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నర్సాపూర్ సీఐ షేక్ లాల్‌మదర్ ఆధ్వర్యంలో కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి సోదాలు నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు లేని 13 బైక్‌లతో పాటు మరో వాహనాన్ని సీజ్ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. చోరీలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని..సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజ్ చేసిన వాహనాలకు సంబంధించి సరైన ధృవపత్రాలు సమర్పిస్తే తిరిగి ఇస్తామని చెప్పారు.

అన్నదాతల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. కొల్గూరులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని సందర్శించడంతో పాటు కంటి వెలుగు వైద్య శిబిరం, స్టీల్ బ్యాంకును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం కేసీఆర్ దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ప్రవేశపెట్టి రైతుల్లో మనోస్థైర్యం నింపారన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా కంటివెలుగు బృహత్తరమైన పథకమని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లం రాజు, ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి, జెడ్పీటీసీ మల్లేశం,ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, కల్యాణ్‌కర్ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో భక్తులు

వైభవంగా బోనాలు

నర్సాపూర్ రూరల్: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ 12వ వార్షికోత్సవంలో భాగంగా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో సాయంత్రం పెద్ద ఎత్తున మహిళలు బోనాల ఊరేగింపు చేపట్టారు. గడ్డమీది ప్రవీణ్‌గౌడ్, జోగిని అవిక బోనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

లింగయ్యగౌడ్ సేవలు మరువలేనివి



లింగయ్యగౌడ్ విగ్రహం వద్ద సునీతారెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): పేద, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దగౌని లింగయ్యగౌడ్ ఎనలేని కృషి చేశారని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో గురువారం ప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లింగయ్యగౌడ్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించి మాట్లాడారు. పేదలకు సాగు కోసం వందల ఎకరాల భూమి దానం చేయడం గొప్ప విషయమన్నారు. గీతా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారని కొనియాడారు. ఈసందర్భంగా 300 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్‌గుప్తా, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మన్సూర్, ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, సర్పంచ్ అనూష, వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, గౌడ సంఘం నేతలు పాల్గొన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.5 కోట్లు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ద్వారా రూ. 1,05,83,558 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. 59 రోజుల అనంతరం గురువారం స్వామివారి ఆలయ ముఖ మండపంలో సిద్దిపేట దేవాదాయ శాఖ పరిశీలకులు రంగరావు ఆధ్వర్యంలో హుండీలను ఆలయ సిబ్బంది, శివరామకృష్ణ భజనమండలి సభ్యులు లెక్కించారు. నగదు రూ. 1,05,83,558, విదేశీ కరెన్సీ 27, మిశ్రమ బంగారం 68 గ్రాములు, మిశ్రమ వెండి 11కిలోల 100 గ్రా ములు, పసుపు బియ్యం 18 క్వింటాళ్లు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. నగదును బ్యాంక్ లో జమ చేసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఏఈఓలు అంజయ్య, శ్రీనివాస్, ధర్మకర్తలు రఘువీరారెడ్డి, సౌజన్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, పోలీసులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



కానుకలు లెక్కిస్తున్న దృశ్యం



ప్లాస్టిక్ రహిత కవర్లలో ప్రసాదం అందిస్తున్న ఆలయ చైర్మన్ భిక్షపతి

ప్లాస్టిక్ రహిత కవర్లు

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆలయంలో లడ్డూ, పులిహోర, సిరా ప్రసాదం ప్యాకింగ్‌నకు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గురువారం నుంచి ప్లాస్టిక్ రహిత కవర్లను వినియోగిస్తున్నట్లు ఆలయ చైర్మన్ గీస భిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా పలువురు భక్తులకు వీటిని అందించినట్లు పేర్కొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం.. రైతన్న ఆగ్రహం



ధర్నా చేస్తున్న రైతులు, పలు పార్టీల నాయకులు

మెదక్‌జోన్: ధాన్యం తూకం వేసినా లారీలు సకాలంలో రాక ఇబ్బంది పడుతున్నామని ఆగ్రహించిన రైతులు పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో గురువారం ధర్నాకు దిగారు. వీరికి బీజేపీ, వైఎస్సార్ టీపీ నాయకులు మద్దతు పలికారు. పట్టణంలోని దాయరవీధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో అనేక సమస్యలు ఉన్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సరిపడా గోనె సంచులు లేవని.. సకాలంలో లారీలు రాక 10 నుంచి 15 రోజుల పాటు కొనుగోలు కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, వైఎస్సార్‌టీపీ నాయకుడు రోహిత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలారని మండిపడ్డారు. అధికారులు సైతం రైతుగోడు పట్టించుకోవడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో 40 కిలోల బస్తాకు బదులు 43 కిలోలు తూకం వేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలను పరిష్కరించి నిబంధనల ప్రకారమే తూకం వేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి విరమింపచేశారు.



రైతు ఒంటిపై నీరు చల్లుతున్న స్థానికులు

రైతు ఆత్మహత్యాయత్నం

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం తరలించడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శివ్వంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. వివరాల్లోకి వెళ్తే.. శివ్వంపేటకు చెందిన రైతు రవితేజ కొనుగోలు కేంద్రానికి ధ్యానం తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నా ఇప్పటివరకు రైస్‌మిల్లుకు తరలించలేదని వాపోయాడు. ఆరు రోజుల క్రితం తూకం వేసినప్పటికీ ధాన్యం తరలించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆరోపించాడు. గురువారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి తన గోడు చెప్పుకునేందుకు రాగా ట్రాక్టర్లతో ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించాలని తహసీల్దార్ సూచించాడు. దీంతో బయటకు వచ్చి వెంట తెచ్చుకున్న డీజిల్‌ను ఒంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. పక్కన ఉన్న కొందరు అడ్డుకుని అగ్గిపెట్టను లాక్కొని నీరు చల్లారు. అకాల వర్షంతో ధాన్యం తడిసిపోతుందని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

క్లుప్తంగా

బంగారం, వెండి అపహరణ

చిన్నకోడూరు(సిద్దిపేట): తాళం పగులగొట్టి ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం..గ్రామానికి చెందిన పంతం సాయికిషోర్ కుటుంబీకులు బుధవారం ఉదయం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి విందుకు వెళ్లారు. తిరిగి ఇంటికొచ్చి చూసేసరికి బీరువాలోని 25 గ్రాముల బంగారం, 10 గ్రాముల రింగు, 5 గ్రాముల కమ్మలు, 15 తులాల వెండి పట్టాగొలుసులు, 6 తులాల వెండి బ్రాస్‌లెట్, 2 తులాల వెండి మెట్టెలు, ల్యాప్‌టాప్ దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివానందం కేసు నమోదు చేశారు.

రెండు బైక్‌లు చోరీ

నర్సాపూర్: వరుస దొంగతనాలతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. లారీ చోరీ విషయం మరువక ముందే రెండు బైకులు చోరీకి గురయ్యాయి. నర్సాపూర్‌కు చెందిన జునెద్ అలీ మాట్లాడుతూ తన బైక్‌ను బుధవారం రాత్రి సంగారెడ్డి మార్గంలోని వాటర్ వాష్ సెంటరు వద్ద పార్కు చేయగా, గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారని చెప్పా రు. నర్సాపూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మల్లేష్ ఆస్పత్రి వద్ద పార్కు చేసిన బైక్‌ను కూడా అపహరించుకువెళ్లారు. ఆస్పత్రి సీసీ కెమెరాలలో చోరీ దృశ్యం రికార్డు అయినట్టు తెలిసింది. తమ బైకులు చోరీ అయ్యామ ంటూ ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యవసాయ పొలం వద్ద..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామంచ గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద పార్క్‌చేసిన బైక్ చోరీకి గురైంది. ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం ..గ్రామానికి చెందిన రైతు ముష్కం గణేశ్ తన బైక్‌పై మంగళవారం సాయంత్రం మల్యాల శివారులోని పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ రోడ్డు పక్కన బైక్ నిలిపి పొలానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించలేదు. దీంతో గురువారం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

నంగునూరు(సిద్దిపేట): తాటి చెట్టుపైనుంచి కింద పడడంతో గీత కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన బందారం శేఖర్‌గౌడ్ గురువారం మధ్యాహ్నం కల్లు గీసేందుకు తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి కిందపడగా కాళ్లు, చేతులు, పక్కటెముకలు విరిగాయి. ఇది చూసిన గ్రామస్తులు అతడిని 108లో సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకేచోట చితి పేర్చి..

నలుగురు అన్నదమ్ముల అంత్యక్రియలు

హుస్నాబాద్: బంధువుల అంత్యక్రియలకు వచ్చిన నలుగురు అన్నదమ్ములు కానరాని లోకాలకు వెళ్లారు. ఇంటి నుంచి బయలుదేరి 24 గంటలు గడవకముందే మృత్యువు కబలించడంతో విగత జీవులయ్యారు. మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన నలుగురు అన్నదమ్ముల మృతదేహాలు గురువారం స్వగ్రామానికి చేరుకున్నాయి. గ్రామానికి చెందిన ఎరుకుల కృష్ణ, శ్రీనివాస్, సంజీవ్, సురేష్ గుజరాత్‌లోని సూరత్‌లో స్థిరపడ్డారు. బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి సూరత్‌కు కారులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్వగ్రామానికి చేరిన మృతదేహాలను చూసిన కుటుంబసభ్యులు బోరున విలపించారు. కడసారి చూసేందుకు గ్రామస్తులు, స్నేహితులు భారీగా తరలివచ్చారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయిన నలుగురికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. వ్యవసాయ క్షేత్రంలో నలుగురికి ఒకే చోట చితి పేర్చి నిప్పుపెట్టారు. మృతులు కృష్ణ చితికి తండ్రి రాజయ్య, శ్రీనివాస్‌కు తండ్రి రాములు, సంజీవ్‌కు కుమారుడు ప్రభాస్, సురేష్‌కు అతడి కుమారుడు భార్గవ్ నిప్పుపెట్టారు. అంతకుముందు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, రాష్ట్ర హౌస్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు.


వ్యవసాయక్షేత్రంలో ఒకే చోట చితికి నిప్పుపెట్టిన కుటుంబసభ్యులు


మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

కార్మికుల ఆందోళన


నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం పారిశ్రామికవాడలోని హారెక్స్ రబ్బర్ పరిశ్రమ అక్రమ లాకౌట్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని కార్మిక భవనం ఎదుట కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక యూనియన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ హారెక్స్ రబ్బర్ పరిశ్రమ అక్రమ లాకౌన్‌ను తక్షణమే ఎత్తేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ లాకౌట్‌తో కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ముందస్తు సమాచారం లేకుండా పరిశ్రమను మూసివేయడం సరైంది కాదన్నారు. కార్మికులకు యూనియన్ అండగా ఉంటుందని వరప్రసాద్‌రెడ్డి తెలిపారు.

పేకాట ఆడుతుండగా...

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని కడవేర్గు శివారులో కొంతమంది పేక ఆడుతున్నట్టు సమాచారంతో గురువారం పేకాట స్థావరంపై దాడి చేసి రూ.20,200లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు.

కార్మికుడి అదృశ్యం

పటాన్‌చెరు టౌన్: కార్మికుడు అదృశ్యమైన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం ఎస్‌ఐ రామునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సహదేవ్(30) పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామ పరిధిలో ఉన్న తోషిబా పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడుగా పనిచేస్తున్నారు. స్థానికంగా ఇద్దరు స్నేహితులతో కలిసి గదిలో ఉంటున్నాడు. ఈనెల 8వ తేదీన డబ్బులు తీసుకుని స్వగ్రామానికి వెళ్తానని బయలుదేరాడు. అయితే స్వగ్రామం చేరుకోలేదు. అద్దెకు ఉంటున్న గదికి కూడా రాలేదు. దీంతో గదిలో ఉంటున్న స్నేహితుడు తస్లీం అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగను పట్టించిన గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): దేవాలయంలో గంటలను దొంగిలిస్తుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..కొండపాకలోని పెద్దమ్మ తల్లి దేవాలయానికి గ్రామస్తులు దర్శనం కోసం వెళ్లారు. గజ్వేల్ మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన చిన్నోజి ఆంజనేయులు దేవాలయంలోని గంటలను దొంగిలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారన్నారు. అనంతరం నిందితుడిని పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి గ్రామ శివారు మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారిలో గుర్తు తెలియనివ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. గురువారం ఉదయం హనుమాన్‌బండల్ శివారు మంజీరాపాయ పక్కన బండ రాళ్ల పక్కన ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్టు పశువుల కాపరుల ద్వారా సమాచారం తెలిసిందన్నారు. ఘటన స్థలానికి వెళ్లి చూడగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయే స్థాయిలో ఉందన్నారు. ఆ వ్యక్తి సుమారు 35 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, ఛాతీపై జంగయ్య అనే పేరుతో పాటు లవ్ సింబల్, దాని పక్కన వీరమణి అనే పేరున్న పచ్చబొట్టు ఉందన్నారు. మరోవైపు మృతుని కుడి భుజంపై ఓం ఆకారంలో మరో పచ్చబొట్టు పొడిచి ఉందన్నారు. శరీర పైభాగంలో ఎలాంటి వస్త్రం లేకపోగా, కింది భాగంలో బూడిద రంగు జీన్ ధరించి ఉన్నాడన్నారు. తలపై బలమైన ఆయుధాలతో గాయపరిచిన ఆనవాళ్లు ఉండటంతో ఎవరైనా హత్య చేసి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేశారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియాస్పత్రికి తరలించినట్టు చెప్పారు. మృతుడి వివరాలు తెలిస్తే.. మెదక్ రూరల్ సీఐ-8712657916, ఎస్‌ఐ కొల్చారం- 8712657919 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.


మృతదేహంపై ఉన్న పచ్చబొట్లు

దోపిడీకి యత్నించిన వ్యక్తి అరెస్టు

నారాయణఖేడ్: ఓ మహిళ మెడలోంచి ఆభరణాలను దోపిడీకి యత్నించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నారాయణఖేడ్ సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి గురువారం ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఖేడ్ మండలం చాప్టా(కె)కు చెందిన బీమ్రా నాగమ్మ (52) బుధవారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రం నుంచి ఒంటరిగా ఇంటికి వెళుతోంది. మార్గమధ్యలో మనూరు మండలం డోవూరుకు చెందిన బూతపల్లి నాందేవ్ ఆమెను అడ్డగించి ఒంటిపై ఉన్న నగలు ఇవ్వాలని లేని పక్షంలో చంపేస్తానని బెదిరించాడు. ఆమె నిరాకరించడంతో చెవికమ్మలు లాగగా చెవి తెగింది. కమ్మలతోపాటు పట్టగొలుసులు, పుస్తెకు సంబంధించిన దండలు లాక్కుని రాయితో తలపై మోది పారిపోతున్న క్రమంలో బాధితురాలు అరవడంతో సమీపంలో ఉన్న ఆమె భర్తతోపాటు పలువురు గ్రామస్తులు వెంబడించి పట్టుకున్నారు. ఖేడ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆభరణాలను సీజ్ చేశారు. నిందితుడిపై దోపిడీ కేసు నమోదు చేసి రిమాండ్‌కుతరలించారు.


నిందితుడి అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి

తప్పిపోయిన వ్యక్తి గుర్తింపు

కుటుంబ సభ్యులకు అప్పగింత

సంగారెడ్డిటౌన్: తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. సంగారెడ్డి మండలపరిధిలోని కులబ్‌గూర్ గ్రామ పంచాయతీ పరిధి టీజీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కృష్ణ మంగళవారం నుంచి కనిపించడం లేదు. దీంతో అతడి భార్య సంగీత బుధవారం సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రూరల్ ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కనిపించకుండా పోయిన వ్యక్తిని పోలీసులు గుర్తించి గురువారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.


కృష్ణను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఈదురుగాలులకు గోదాం పైకప్పు ధ్వంసం


లేచిన గోదాం పైకప్పు రేకులు

దుబ్బాకరూరల్: మండలంలో రెండు రోజుల క్రితం వీచిన ఈదురుగాలుల ధాటికి దుబ్బాక వ్యవసాయ మార్కెట్ గోదాం పైకప్పు రేకులు ధ్వంసమయ్యాయి. నాలుగు నెలల క్రితమే ఏర్పాటు చేసిన పైకప్పు నాణ్యతతో లేకపోవడంతోనే ఇలా జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ పనులు నాసిరకంగా చేపట్టడంతోనే గాలిదుమారానికి రేకులు విరిగిపోయాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే కాంట్రాక్టర్లు ఇష్టారీతిన పనులు చేస్తున్నారని, నాణ్యతను పరిశీలించకుండా అధికారులు బిల్లులు మంజూరు చేస్తున్నారని విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి నాసిరకం రేకులు వేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సారాయి విక్రేత అరెస్ట్

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని జాంగార్‌బౌలి తండాలో అక్రమంగా సారాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు తండాకు వెళ్లి రాథోడ్ అనిల్ పట్టుకుని ఐదు లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కర్ణాటకలో తక్కువ ధరకు కొనుగోలు చేసుకుని వచ్చి ఇంటి దగ్గర ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.


నాటు సారాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

మెదక్ మున్సిపాలిటీ: భార్యతో గొడవపడి ఓ భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ పట్టణంలో గురువారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన సర్వర్ (36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బంధువుల పెళ్లిలో భార్య ముబీనాబేగంతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇంటికి చేరుకొని ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడిభార్య ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లింగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు రైతుల ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళా రైతు, యువ రైతు, కూతురి పెళ్లి చేసిన అప్పు తీర్చేందుకు భూమి అమ్మగా, ఆ విషయమై గొడవ జరగడంతో ఇంకో రైతు ఆత్మహత్య చేసుకున్నాడు.

భూమి విషయంలో గొడవతో...


కడాల రమేశ్ (ఫైల్)

జోగిపేట(అందోల్): కూతురు పెళ్లికి చేసిన అప్పుతీర్చేందుకు తన కున్న భూమిని విక్రయించగా, ఆ భూమి వివాదంలో చిక్కుకోవడంతో మనస్తాపంతో విక్రయించిన భూమిలోనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఎస్‌ఐ 2 జయశంకర్ కథనం ప్రకారం... జోగిపేటకు చెందిన రమేశ్(50) తన కూతురు పెళ్లి కోసం అప్పు చేశాడు. హైదరాబాద్ ప్రాంతానికి చెందిన వారికి 20 గుంటల భూమిని విక్రయించాడు. అయితే కొనుగోలు చేసిన వ్యక్తి 20 గుంటల భూమి చుట్టూ కడీలలు ఏర్పాటు చేశాడు. అయితే ఇందులో 2 గుంటల భూమి తన భూమిలో నుంచి పోయిందని రమేశ్‌ను సోదరుడు ప్రశ్నించాడు. దీంతో అన్నదమ్ముల మధ్య వివాదం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కొనుగోలుదారుడు మీ భూమి మీరు తీసుకొని నా డబ్బు నాకు ఇవ్వాలని కొన్ని రోజులుగా డిమాండ్ చేశాడు. భూమి అమ్మగా వచ్చిన డబ్బుతో పెళ్లి అప్పు చెల్లించాడు. తీవ్ర మనస్తాపానికి గురైన రమేశ్ బుధవారం రాత్రి తాను దావత్ వెళుతున్నానని, ఆలస్యం అవుతుందని, ఇంట్లో చెప్పి బయటకు వచ్చాడు. గురువారం సోదరుడు పొలం వద్దకు వెళ్లగా అక్కడ రమేశ్ అక్కడ విగత జీవిగాపడి ఉండటాన్ని గమనించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయి ఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం పక్కన ఎలుకల మందు, మద్యం బాటిల్ ఉండటంతో అది సేవించినట్లు పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మల్లేశ్వరీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో మహిళా రైతు...


బద్దిపడగ మాధవి (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళా రైతు చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం ..హుస్నాబాద్ మండలం కూచనపెల్లి గ్రామానికి గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి మాధవి(35) దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వ్యవసాయం, ఇల్లు నిర్మాణం కోసం రూ.7లక్షలు, పాడిపశువుల కొనుగోలు కోసం మరో రూ.2 లక్షలు అప్పు చేశారు. పాడి పశువులు నెల రోజులకే మరణించాయి. దీంతో అప్పు తలకు మించిన భారమైంది. దీంతో మనస్తాపం చెందిన మాధవి ఈ నెల 2న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి అక్క పుష్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహేశ్ తెలిపారు. మృతురాలికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువరైతు


మొగుళ్ల కుమార్ (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన మొగుళ్ల కేసోళ్ల రాజయ్య-కిష్టవ్వల కుమారుడు కుమార్(34) గొర్ల పెంపకంతో పాటు తనకున్న 30 గుంటల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ భార్య కల్పనను పోషించుకుంటున్నాడు. కాగా కుమార్‌కు పెళ్లై ఏడు సంవత్సరాలు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. పిల్లల కోసం అందిన కాడికి అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగేవాడు. దీంతో ఫలితం కానరాకపోవడంతో మదన పడేవాడు. మరోవైపు ఇటీవల వడ్ల అకాల వర్షాలకు 30గుంటల్లో వేసిన పంటలు దెబ్బతిన్నాయి. కనీసం పెట్టిన పెట్టుబడులు రాలేదు. ఈ క్రమంలో ఆర్థికభారం మరింతగా పెరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన కుమార్ బుధవారం అర్ధరాత్రి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. భార్య కల్పన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడిమెదక్ జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. మరో నలుగురు గాయపడ్డారు.

బైక్, ట్రాలీఆటో ఢీకొని..


బుసగల్ల శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్ రూరల్: బైక్, ట్రాలీఆటో ఢీకొన్న సంఘటనలో ఒక మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. నర్సాపూర్ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలపరిధిలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన బుసగల్ల శ్రీనివాస్ (42) వెలమకన్నె కృష్ణ కలిసి బైక్‌పై నర్సాపూర్ నుంచి సంగారెడ్డి వైపు వెళుతున్నారు. రేణుకఎల్లమ్మ ఆలయ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాలీఆటో వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న బుసగల్ల శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణకు పలుచోట్ల గాయాలు కాగా, అతని పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య మల్లమ్మ, పిల్లలు సాయికిరణ్, నిహారిక, ధనుష్ ఉన్నారు. శ్రీనివాస్ తనకున్న కొద్దిపాటి భూమి సాగు చేస్తూ ఖాళీ సమయంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు.

రైస్‌మిల్లుకు వెళ్తుండగా...

బుసగల్ల శ్రీనివాస్, కృష్ణలు రైస్‌మిల్లుకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. నర్సాపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేయడంలో ఆలస్యమవుతుందని, మిల్లులో ధాన్యం అమ్ముకుందమని అడిగేందుకు ఇద్దరూ వెళుతుండగా, ఈ ఘటన చోటుచేసుకుంది.

బైక్‌పై నుంచి పడి మహిళ ..


లక్ష్మి మృతదేహం

వర్గల్(గజ్వేల్): చికిత్స కోసం అల్లుడితో బైక్‌పై వెళ్తున్న మహిళ కిందపడి మృతి చెందింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం లాల్‌గాడి మలక్‌పేటకు చెందిన వీరన్నగారి లక్ష్మి(61) ఆరోగ్యం బాగాలేకపోవడంతో గజ్వేల్ ఆస్పత్రిలో చూపించుకునేందుకు తన అల్లుడు ఎర్రబాబు నాగరాజుతో బైక్‌పై బయల్దేరారు. ఈ క్రమంలో వర్గల్ మండలం గౌరారం వద్ద బైక్ అదుపు తప్పడంతో వెనుకాల కూర్చున్న ఆమె ఎగిరి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో ఆమె తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి కింద పడి వివాహిత


శైలజ (ఫైల్)

ములుగు(గజ్వేల్): ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ఓ మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ రంగ కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..ములుగు మండలం గంగధార్‌పల్లికి చెందిన తాటికొండ శైలజ(19) భర్త సురేష్‌గౌడ్‌లు గురువారం ఉదయం తూప్రాన్ మండలం కాళ్లకల్ నుంచి గంగధార్‌పల్లికి బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో తున్కిబొల్లారం గ్రామ శివారులోకి చేరుకోగానే శైలజ చున్ని బైక్ చక్రానికి చుట్టుకుని ఆమె మెడకు బిగుసుకొని కిందపడింది. ఈ ఘటనలో ఆమె తలకు, ముఖానికి బలమైన గాయాలు కావడంతో అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సును ఢీకొన్న బైక్


గాయపడిన నవీన్

కౌడిపల్లి(నర్సాపూర్): ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఓ బైక్ బస్ ఢీకొంది. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ వద్ద గురువారం జరిగిన ఈ ఘటనలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కౌడిపల్లికి చెందిన రాకేష్, నవీన్ బైక్‌పై ధర్మసాగర్ వెళుతున్నారు. ముందు ఉన్న బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా మరో బస్సు వచ్చింది. దీంతో బైక్‌ను పక్కకు తప్పించే క్రమంలో ముందున్న బస్సును ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న నవీన్‌కు కిందపడి గాయాలయ్యాయి. బాధితుడిని ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరికి గాయాలు


గాయపడిన పాపయ్య

కౌడిపల్లి(నర్సాపూర్): రెండు మోపెడ్‌లు ఎదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని దేవులపల్లి గ్రామానికి చెందిన శంకరయ్య, కురుమ పాపయ్యలు మోపెడ్‌పై ధర్మాసాగర్‌కు నుండి వస్తున్నారు. ఇస్మాల్‌ఖాన్‌పేటకు చెందిన దుర్గేష్ మోపెడ్‌పై భార్య కొడుకుతోపాటు మరోబాలుడు శరత్‌తో వెళుతున్నాడు. రెండు మోపెడ్‌లు ధర్మాసాగర్‌గేట్ సమీపంలోకి రాగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో పాపయ్య, శరత్‌లకు గాయాలు అయ్యాయి. దీంతో పోలీసులు బాధితులను కౌడిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు గాయాలు కావడంతో ఇద్దరినీ మెదక్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.